క్లుప్తంగా

గెలుపోటములు సహజం



ఏటూరునాగారం : క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎస్సై తాజొద్దీన్ అన్నారు. బుధవారం మండలంలోని రామన్నగూడెంలో మహాశివరాత్రి సందర్భంగా కాంగ్రెస్ యూత్ రాష్ట్ర నాయకుడు సూర్య ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను నిర్వహించారు. పోటీలకు ముఖ్య అతిథిగా ఎస్సై హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్ది రాజబాబు, గుండెపు రాజు, ప్రణయ్, నవీన్, రామకృష్ణ, వాజేడు, ఏటూరునాగారం మండలాలకు చెందిన క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ట్యాంకర్ టైరు పగిలి వృద్ధురాలికి గాయాలు



గాయపడిన రామలక్ష్మి

భువనగిరి టౌన్ : వాటర్ ట్యాంకర్ టైరు పగిలి అందులో నుంచి వేరుపడిన ఇనుప వస్తువు ఇంట్లో కూర్చొని ఉన్న వృద్ధురాలికి తాకడంతో ఆమెకు తీవ్ర గాయాలైన ఘటన బుధవారం భువనగిరి పట్టణంలో జరిగింది. బాధితురాలి కథనం ప్రకారం.. భువనగిరిలోని అర్బన్ కాలనీకి చెందిన సత్యనారాయణరెడ్డి ఇటీవల మృతి చెందాడు. సత్యనారాయణరెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు అతడి సోదరి రామలక్ష్మి ములుగు జిల్లా వాజేడు మండలం జగన్నాథపుర నుంచి భువనగిరికి వచ్చింది. బుధవారం రామలక్ష్మి ఇంట్లో కూర్చొని ఉండగా స్థానికంగా నీటిని సరఫరా చేసే ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ అటుగా వెళ్తుండగా దాని వెనుక టైరు పగిలింది. దీంతో టైరు నుంచి వేరుపడిన ఇనుప వస్తువు ఇంట్లో మంచంపై కూర్చొని ఉన్న రామలక్ష్మికి తాకింది. దీంతో ఆమె కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకువెళ్లారు. బాధితురాలి కుటుంబసభ్యు ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి..

మడికొండ: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మడికొండ చౌరస్తా సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాంపూర్ నుంచి భూపాలపల్లి జిల్లా ఒడితల గ్రామానికి చెందిన మండల శేఖర్, గణేష్, ఒడిశాల శ్రీకాంత్ ఆటోలో వెళ్తుండగా, జనగామ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న కారు.. ఆ ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి చికిత్స 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.



టేకుమట్ల: బూర్నపల్లిలో ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి



రేగొండ: గడిపల్లి శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



టేకుమట్ల: బూర్నపల్లిలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తదితరులు

మార్మోగిన శివనామస్మరణ

కనులపండువగా శివపార్వతుల కల్యాణం

- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు

కాటారం : మహాశివరాత్రి పర్వదినాన్ని మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రంలోని భక్తాంజనేయ, గారెపల్లి ఆంజనేయ స్వామి ఆలయాలతో పాటు శ్రీ ఆనంద ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయం, ఒడిపిలవంచ భూనీలా సహిత వెంకటేశ్వర స్వామి ఆలయం, చింతకాని చెన్నకేశవ స్వామి ఆలయం, ధన్వాడ దత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వార్లకు పురోహితులు అభిషేకాలు, అర్చనలు జరిపించారు. పలు ఆలయాల్లో భజన కీర్తనలు నిర్వహించారు. ప్రజలు సాయంత్రం తమ ఇంటి ఎదుట దీపాలు పెట్టి బోనం మొక్కులు సమర్పించుకున్నారు. జాగారాలు చేసి స్వామి వారిని పలు కోరికలు కోరుకున్నారు.

మల్హర్‌లో..

మల్హర్ : మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో వేడుకలను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రం తాడిచర్ల వెంకటేశ్వర, హనుమాన్ ఆలయం, నాచారం మల్లన్న గుట్ట, పెదతూండ్ల హనుమాన్ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కొయ్యూర్ అటవీ ప్రాంతంలోని నైన గుహలో మహా లింగేశ్వర స్వామి, నాచారం మల్లన్న గుట్ట, పెద్దతూండ్ల హనుమాన్ సహిత మద్రాజరాజేశ్వరి ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. తాడిచర్ల ఏఎమ్మార్ కంపెనీ ఆధ్వర్యంలో నైన గుహల ఆలయంలో భక్తులకు పులిహోర పంచిపెట్టారు.

రేగొండలో..

రేగొండ : రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లోని ఆలయాల్లో బుధవారం మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు శివాలయాలకు చేరుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని సదాశివాలయంలో వేద పండితులు శివపార్వతుల కళ్యాణమహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవాన్ని తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కళ్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

టేకుమట్లలో..

టేకుమట్ల : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండల కేంద్రంతో పాటు వెలిశాల, రాఘవారెడ్డిపేట, బూర్నపల్లి శివాలయాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయాల్లో శివపార్వతుల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు.

ప్రత్యేక పూజలో పాల్గొన్న నేతలు

మండలంలోని రాఘవారెడ్డిపేట, వెలిశాల, బూర్నపల్లి గ్రామాల్లో శివపార్వతుల కల్యాణానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారిలు వేర్వేరుగా హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుల కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లిలో..

మొగుళ్లపల్లి : మండలంలోని పిడిసిల్ల, పర్లపల్లి, పోతుగల్లు, మొగుళ్లపల్లితో పాటు వివిధ గ్రామాల్లో బుధవారం మహాశివరాత్రి వేడుకలను నిర్వహించారు. ఉదయం నుంచే భక్తుల రాకతో ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులు జాగారం, ఉపవాస దీక్షలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయాల్లో శివపార్వతుల కల్యాణాన్ని ఆలయాల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిపించారు. మొగుళ్లపల్లి, పిడిసిల్ల, పర్లపల్లి గ్రామాల్లో జరిగిన శివపార్వతుల కల్యాణంలో మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు.



మల్హర్: నాచారం మల్లన్న గుట్ట వద్ద శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు, భక్తులు



రేగొండ: పూజలో పాల్గొన్న ఎస్సై సందీప్ కుమార్



మల్హర్: భక్తులకు పులిహోర ఇస్తున్న ఏఎమ్మార్ కంపెనీ సిబ్బంది



మల్హర్: నైన గుహలో శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న రాజిరెడ్డి దంపతులు



కాటారం: ప్రత్యేక అలంకరణలో కాటారం భక్తాంజనేయ స్వామి



రేగొండలో.. అన్నదానం



భూపాలపల్లి పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం



టేకుమట్ల: వెలిశాలలో పూజలు చేస్తున్న భక్తులు



రేగొండ: కొత్తపల్లిగోరి సదాశివాలయంలో కల్యాణ మహోత్సవం

ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం

న్యూశాయంపేట: ముస్లిం, మైనార్టీల ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని ముస్లిం యూనిటీ అండ్ డెవలప్‌మెంట్ మూవ్‌మెంట్ గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ సుభాన్ అన్నారు. హనుమకొండ ములుగురోడ్డులోని ముస్లిం కమ్యూనిటీ సెంటర్‌లో బుధవారం జరిగిన సమావేశంలో గ్రేటర్ వరంగల్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సుభాన్ మాట్లాడుతూ ముస్లింలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, ఈక్రమంలో పార్టీలకు అతీతంగా, కలిసికట్టుగా అభివృద్ధి కోసం పనిచేయాలని సూచించారు. జనాభాకు అనుగుణంగా తమకు రావాల్సిన వాటా కోసం ప్రభుత్వాలతో పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

భక్తులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న రాజబాపు

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మహాశివరాత్రికి వచ్చిన భక్తులకు కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు లేతకరి రాజబాపు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. బుధవారం మధ్యాహ్నం భక్తులకు సుమారుగా 300 ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట నాయకులు పవన్‌శర్మ, బాబాతాజ్, శంకర్, సమీర్ తదితరులు ఉన్నారు.

జాతరలో వైద్యసేవలు

మహాశివరాత్రి సందర్భంగా కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన దేవస్థానం ఆవరణ, బస్టాండ్, గోదావరి వద్ద మూడుచోట్ల వైద్యా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. బుధవారం జాతరకు వచ్చిన రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కాళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి సుస్మిత, జిల్లా ప్రోగ్రాం అధికారి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్..

వెంకటాపురం(ఎం): మహాశివరాత్రి సందర్భంగా రామప్ప ఆలయానికి వచ్చిన భక్తులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గంగిశెట్టి సరస్వతి జ్ఞాపకార్థం ఉచితంగా మినరల్ వాటర్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ రాజు బుధవారం ప్రారంభించి మాట్లాడుతూ భక్తులకు ఉచితంగా మినరల్ వాటర్ పంపిణీ చేస్తున్నందుకు లయన్స్‌క్లబ్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఈఓ బిల్ల శ్రీనివాస్, లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ మెరుగు రమేష్, సెక్రటరీ చుంచు రమేష్, సభ్యులు సానికొమ్ము రవీందర్‌రెడ్డి, కొండి సాంబశివ, సుబ్బారెడ్డి, ఆడెపు రాజు తదితరులు పాల్గొన్నారు.

నెలరోజులుగా మృత్యువుతో పోరాటం..

- చికిత్స పొందుతున్న యువకుడి మృతి



రక్షిత్ కుమార్ (ఫైల్)

చిట్యాల : తల్లిదండ్రులు మందలించారని మనస్తాపానికి గురైన ఓ యువకుడు పురుగుల మందు తాగి నెలరోజులుగా మృత్యువుతో పోరాడి తుదిశ్వాస విడిచిన సంఘటన మండలంలోని వెంచరామి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంచరామికి చెందిన దాసరి రక్షిత్‌కుమార్ (18) వరంగల్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. కళాశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే కూలీ పని చేస్తూ తల్లిదండ్రులు దాసరి వాణి–యుగేందర్‌లకు ఆసరాగా ఉంటున్నాడు. ఈక్రమంలో గతనెల 27న ఇంట్లో తల్లిదండ్రులతో గొడవ పెట్టుకొని రక్షిత్ కుమార్ మద్యం తాగి వచ్చాడు. గమనించిన తల్లిదండ్రులు అతడిని మందలించడంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పరకాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ లోని ప్రై వేట్ హస్పటల్‌కు తరలించి చికిత్స అందించారు. నెల రోజులుగా చికిత్స పొందుతున్న రక్షిత్‌కుమార్ పరిస్థితి విషమించడంతో మంగళవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి తండ్రి యుగేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు.

బావిలో దూకి వృద్ధుడి ఆత్మహత్య

రేగొండ: బావిలో దూకి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని భాగిర్థిపేటలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భాగిర్థిపేటకు చెందిన సుంకరి రవి (60) కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా జబ్బు నయం కాలేదు. కాగా ఇటీవల వైద్యులు తన కాళ్లు తీసేయాలని తెలపడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో రెండ్రోజుల క్రితం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కానీ కుటుంబ సభ్యులు ఎవరి ఇంటికైనా వెళ్లి ఉంటాడని భావించి బంధువులకు ఫోన్ చేసి ఆరా తీశారు. ఈ క్రమంలో బుధవారం గ్రామంలోని ఓ వ్యవసాయ బావి నుంచి దుర్వాసన వస్తోందని గ్రామస్తులు గ్రహించి బావిలోకి చూడగా రవి మృతదేహం కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు.

ఆలయ అభివృద్ధికి దాతల సాయం

వేలేరు : మండలంలోని కమ్మరిపేట గ్రామంలో గల అతిపురాతనమైన రామలింగేశ్వర స్వామి ఆలయానికి వేలేరు గ్రామానికి చెందిన బిల్లా యుగేందర్ రూ.50వేల విలువ చేసే బోర్ మోటార్, పైప్‌లను అందించారు. జర్పుల రాజు, బాదావత్ సమ్మయ్య గర్భగుడిలో గ్రానైట్ స్టోన్, గూటం వీరస్వామి మంచినీటి ట్యాంక్‌ను కట్టించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సాయం అందించాలని కోరారు. అనంతరం దాతలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

అంటుకుంటే మిగిలేది బుగ్గే..

- అందుబాటులో లేని ఫైర్‌స్టేషన్..
- అగ్ని ప్రమాదాల్లో సర్వం కోల్పోతున్న బాధితులు
- వేసవి సమీపించడంతో ఆందోళన చెందుతున్న మండలవాసులు



శాంతినగర్‌లో కాలిపోతున్న ఇళ్లు (ఫైల్)

టేకుమట్ల : పల్లెల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఏమాత్రం ఏమరు పాటుగా ఉన్న క్షణాల్లో అగ్నికీలల్లో సర్వం దగ్ధం కావల్సిందే. ప్రతీఏటా అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నప్పుడు స్థానికులు తీవ్రంగా కష్టపడుతూ మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. అంతే కానీ ఫైరింజిన్ రాని పరిస్థితి. మండల కేంద్రానికి భూపాలపల్లి, పరకాల ఫైర్‌స్టేషన్లు సుమారు 35కిలో మీటర్ల దూరంలో ఉంటాయి. ఇక అగ్ని ప్రమాదం సంభవించిన క్షణాల్లో మంటలు వ్యాపిస్తాయి. అప్పుడు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందిస్తే మండల కేంద్రానికి చేరుకునేందుకే సుమారు గంట సమయం పడుతుంది. మండలంలో ఏ గ్రామానికి వెళ్లాలన్నా అధిక సమయం పడుతుడటంతో ఇప్పటి వరకు అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో ఏనాడు సకాలంలో ఫైరింజన్ చేరుకున్న దాఖలాలు లేవు. మండలం నుంచి సమాచారం అందుకున్న ఫైర్ అధికారులు చేరుకునే లోపు బుగ్గిపాలైన సంఘటనలే ఉన్నాయి. జిల్లాలో ఒక్కటే అగ్నిమాపక కేంద్రం ఉండడంతో ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే భూపాలపల్లి నుంచి వెళ్లాలి. గతంలో పరకాల అగ్నిమాపక కేంద్రం సేవలను అందించేది. మండలంలో ఫైర్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయడంలో అధికారులు, పాలకులు విఫలమవుతున్నారని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా మండలంలోని జరిగిన అగ్ని ప్రమాదాలు కొన్ని..

- 2016లో మండలంలోని బోయినిపల్లిలో మూడిళ్లకు నిప్పు అంటుకుని పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాద సమయంలో 101కి కాల్ చేస్తే ఇళ్లు పూర్తిగా కాలిపోయాక ఫైరింజన్ చేరుకుంది. అప్పటికి బూడిద మిగిలింది.
- 2018లో పెద్దంపల్లిలో నిరుపేదకు చెందిన ఇళ్లు దగ్ధం కాగా ఫైరింజన్‌కు సమాచారం అందిస్తే కాలిబూడిదయ్యాక చేరుకుంది.
- 2020సంవత్సరంలో అంకుషాపూర్ గ్రామానికి చెందిన తోట గట్టయ్యకు చెందిన ఇళ్లు షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధం కాగా ఇంట్లోని వస్తువులన్నీ పూర్తిగా కాలిపోయాయి. ఫైరింజన్‌కు సమాచారం అందించినా సకాలంలో చేరలేదు.
- 2023లో మండలంలోని దుబ్యాల గ్రామానికి చెందిన రైతు పొలంలోని గడ్డి, ధాన్యం ప్రమాదవశాత్తు దగ్ధం కాగా స్థానికులు మంటలను ఆర్పుతూ ఫైరింజన్‌కు సమాచారం అందిస్తే సకాలంలో చేరలేదు.
- గర్మిళ్లపల్లిలో గడ్డివాము షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధం కాగా 101కి సమాచారం అందిస్తే ఫలితం శూన్యం.
- పోతుగల్లులో 2019లో మూడిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి.
- శాంతినగర్‌లో గతేడాది జరిగిన అగ్ని ప్రమాదంలో మూడిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి.
- మండలంలోని రామకిష్టాపూర్(వి) గ్రామానికి చెందిన ఎడ్ల పోశాలుకు చెందిన ఇంట్లో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయారు.
- ఇటీవల మండలంలోని వెలిశాలలో ఓ వృద్ధురాలి ఇళ్లు దగ్ధమైంది.

ఇలా మండలంలో నిత్యం ఎన్నో అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నా సమీప దూరంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం మూలంగా ఎంతో మంది అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులవుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించి మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.15లక్షల మేర నష్టం జరిగింది



ఇటీవల మా ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయాము. నిత్యావసర వస్తువులతో పాటు, బంగారం, నగదు, దుస్తువులు సైతం పూర్తిగా కాలిపోయాయి. అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందిస్తే ఇళ్లు మొత్తం కాలిపోయినాక వచ్చింది. నష్టం జరిగాక వస్తే ఏం ఉపయోగం. అందుబాటులో ఫైర్‌స్టేషన్ ఉంటే ఇంత నష్టం జరిగేది కాదు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.15లక్షల మేర నష్టం జరిగింది.

– ఎడ్ల రమణ, బాధితుడు, రామకిష్టాపూర్.వి

ఇళ్లు పూర్తిగా కాలిపోయింది..



2020లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకుని ఇళ్లు మొత్తం కాలిపోయింది. మంటలు ఆర్పేందుకు ఫైరింజన్‌కు కాల్ చేస్తే సకాలంలో రాలేదు. దీంతో స్థానికుల సహాయంతో మంటలను ఆర్పేసాం. కానీ అప్పటికే ఇంట్లోని సామగ్రి మొత్తం కాలిపోయింది. ఫైర్‌స్టేషన్ అందుబాటులో ఉంటే అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు కొంత వరకు నష్టాన్ని నివారించవచ్చు. ఇప్పుడు ప్రమాదం జరిగితే నష్టం తప్పడం లేదు.

– తోట గట్టయ్య, అంకుషాపూర్

ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించాలి



చిట్యాల : మండల కేంద్రంలోని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌కుమార్ బుధవారం సందర్శించారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సీఐ మల్లేష్, సిబ్బంది ఉన్నారు.